# సన్నాయి రాగాలు

**త**న్మయి పెళ్ళి చిన్మయుడితో నిశ్చయమయింది. పెళ్ళి ముహూర్తం యిక రెండు రోజులే వుందనగా, చిన్మయుడు తండ్రి, కాబోయే వియ్యంకుడితో "పెళ్ళిలో సన్నాయి మాత్రం వాయించే ఏర్పాటు వద్దు, మానేద్దాం!" మరీ తప్పదు అంటే చిన్న చిన్న సన్నాయి నొక్కులతో ముగించేద్దాం"అన్నాడు.

"ఏమిటో బావగారూ! సన్నాయి చాలా శుభప్రదం కదా, అది ఎందుకు వద్దంటున్నారో తెలియటం లేదు!" "ఏం లేదు! మా అబ్బాయికి ఎప్పుడైనా తక్కువ మార్కులు వస్తే వాళ్ళ క్లాస్ టీచర్, "నిన్ను సన్నాయి వాయించినట్లు వాయిస్తా "ననేవారట! పైగా ఒకసారి మావాడికి ట్యూషన్ చెప్పే మాస్టారి భార్యగారి చీరలు, చెప్పిన వెంటనే యిస్త్రీ చేయించలేదని వాళ్ళింట్లో వున్న పాత సన్నాయి తిరగేసి మావాడి వీపు మీద కొట్టిందట! అప్పట్నుంచీ మావాడికి సన్నాయి అంటే భయం పట్టుకుంది! పైగా ఆ ప్రైవేట్ మాస్టారు ఆమెని మందలిస్తే "డొక్కచింపి డోలు కడతా "నందట!.

"చాలా బాగుంది! మీ వాడికి చిన్నప్పుడు మార్కులు తక్కువ వచ్చేవని సంబంధం నిశ్చయం కాకముందు చెప్పలేదేం!"

"ఆ ! ఆమాట కొస్తే మీ అమ్మాయి నీళ్ళున్న చోటల్లా జారి పడిపోతుందని విన్నాం!" మరి ఈ విషయం మీరెందుకు చెప్పలేదు"

"అబ్బో! బావగారు చతురులే! ఆ రెండూ ఒకదాని కొకటి చెల్లు! మీరు చెప్పినట్లే చేద్దాం! "అన్నాడు, గడసరి వియ్యంకుడు.

తక్కువ ధ్వనిగల చిన్న చిన్న సన్నాయి నొక్కులతో పెళ్ళయిపోయింది! ఓ రోజు తన్మయి, "చిన్నప్పుడు మీరు మీ మాస్టారి భార్య చేత సన్నాయి దెబ్బలు తిన్నారట కదూ! పైగా స్కూల్లో మీ క్లాస్ టీచర్ కూడా మిమ్మల్ని సన్నాయి వాయించినట్లు వాయిస్తాననేవారట!"

"ఏమో నాకు జ్ఞాపకం లేదు!"

"ఆ ఎందుకండీ అబద్ధాలు! ఆ విషయాలు జ్ఞాపకం లేకపోతే మీకు యిప్పటికీ సన్నాయి అంటే ఎందుకు భయం".

"భయం అని ఎవరు చెప్పారు! నాకు అదంటే యిష్టం లేదు. దాని వలన చిరాకు కలుగుతుంది!"

"మీ కొక చిన్న రహస్యం చెవుతాను! మాతాత సన్నాయి ఆప కుండా వాయించేవారట ఆ దెబ్బకి నాగు పాములు భయపడి పారిపోయేవి"

"అదేమిటి చాలా ఆశ్చర్యంగా వుందే! నాదస్వరానికి పాములు నాట్యం చేస్తాయని

విన్నాను".

"ఏమో మరి! పాములకి ఆ వాయింపు అర్థం కాలేదనుకుంటాను! ఓ సారి మా తాతకి ఎవరో సలహా యిచ్చారు. "ఊరికే సన్నాయి వాయించద్దు. ఎవరింట్లోనైనా జాతిపాము వచ్చినప్పుడు వాళ్ళింట్లో వాయించండి. పామూ పారిపోతుంది మీకు పారితోషికం వస్తుంది ఈ విషయం పాములకెలా తెలిసిందో కాని, మాతాత సన్నాయికి భయపడి ఎవరింటికీ పాములు రాలేదు. ఈ విషయాలు తెలుసుకున్న ఊళ్ళో పెద్దలు మా తాతకి "నాగశతృ" అని ఓ బిరుదు ప్రదానం చేశారు. మా బామ్మ పేరు "నాగమణి"

మా బామ్మ అంటే మా తాతకి పడేది కాదు. అస్తమానం బామ్మని తిడుతూండేవాడు! ఆయనతో పడలేక, ఈ "నాగ శతృ" బిరుదు మీకు సరిగ్గా సరిపోయింది." అనేది ఇదంతా వినిన చిన్మయుడు, "అసలు మీ తాత సన్నాయి వాయించేవారని తెలుస్తే నిన్ను పెళ్ళాడక పోదును!" అన్నాడు.

"ఈ ప్రపంచంలో మీరొక్కరే మగాడన్నట్లు మాట్లాడాతరేమిటి! ఇంకో పురుషోత్తముడ్ని చేసుకునేదాన్ని! అంది, తన్మయి.

"అబ్బో చాలా గొప్పదానివే! అది సరేగాని, సన్నాయి ఆపకుండా వాయించడంవలన ఒంట్లోవున్న ఊపిరంతా ఖర్చయిపోయి, పోయుంటారు కదూ మీ తాత!" అన్నాడు చిన్మయుడు.

"అదేంకాదు! ఆయన చాలా బలమయిన వారు! ఈ జన ఘోష, పాముల వుసురు అన్నీ తగిలుంటాయ్! అందుకే పోయారు".

సన్నాయి అంటే చిన్మయుడికి యిష్టం లేదని ఎవరు చెప్పారో తెలియదుకాని, ఒక్క సన్నాయి అంటేనే యిష్టం లేక ఏడుస్తూంటే, జోడు సన్నాయి మేళం వచ్చి అతని యింటి ముందు తనివితీరా వాయించుకునేవారు. వాళ్ళ మీద కేకలు వేసేవాడు. ఒక్క రూపాయి కూడా, యివ్వకపోగా కేకలు వేస్తూన్నందుకు ఆ జోడు సన్నాయి మేళం వాళ్ళు విసిగి పోయారు!

మొగుడితో పుట్టింటికి వెళ్ళకూడాదని, పెళ్ళయిన కొత్తలో ఎవ్వరో శ్రేయోభిలాషి చెప్పిన విషయం గుర్తుపెట్టుకున్న తన్మయి, ఓ సారి తను ఒంటరిగానే పుట్టింటికి వెళ్ళింది.!

ఆ తరుణి లేని తరుణంలో, ఓ ఆదివారం అన్నం గట్టిగా దట్టించిన చిన్మయుడు గాఢ నిద్రలో మునిగిపోయాడు. అసలే వేసవి.! మిట్ట మధ్యాహ్నం! ఆ వీధిలో యించుమించు చాలా మంది నిద్రలో మునిగిపోయారు! "మంచి సమయం మించిన దొరకదు" అని ఆ జోడు సన్నాయి వాళ్ళు వచ్చి, తమ వాయింపు మొదలు పెట్టారు. కాసేపటికి ఒక్కడే వాయించడం మొదలు పెట్టాడు. కిటికీలోంచి ఓరగా చూసిన చిన్మయుడు కాసేపటికి వాడే పోతాడులే అని నిద్ర నటించాడు!

అయ్యగారు నిద్రలో వున్నారు! మెళకువ వచ్చినా ఎలాగూ దానం చెయ్యరని తెలుసనున్న ఆ జోడు సన్నాయి వాళ్ళల్లో ఒకడు సన్నాయి ఎవ్వరైనా వాయించుకోవచ్చునన్న సదుద్దేశంతో తన సహవాద్యగాడు ఘోరంగా వాయిస్తూన్న సమయంలో, పెరట్లో తేలిగ్గావున్న కుర్చీలూ, ఓ సైకిలూ చక్క పెట్టాడు.

అప్పుడు కిటికీ తలుపులు తీసి, వెళ్ళారా లేదా అని చూసాడు చిన్మయుడు! వాళ్ళు వెళ్ళి పోయారు!

ఆ సాయంకాలం తన్మయి పుట్టింటి నుంచి వచ్చేసింది! వీధి తలుపు కొట్టి, భర్తని లేపింది. సేద తీరిన తర్వాత పెరట్లో మాయమైన కుర్చీలూ, సైకిల్ పసిగట్టింది.

"మీకు అసలు బుర్రలేదండి! అసలే వేసవి కాలం! మిట్ట మధ్యాహ్నం, అందరూ పడుకునే వేళ తలుపులు వేసుకుని అదే పనిగా నిద్రపోతే మరి దొడ్లోవున్న సామాన్లు ఎవడో ఒకడు పట్టుకుపోతాడన్న జ్ఞానం కూడా లేదు మీకు!"

మధ్యాహ్నం ఆ జోడు సన్నాయి వాళ్ళలో ఒకడు వచ్చి కచేరీ చేశాడు. మీ తాత సన్నాయి వాయించే వారని నువ్వు చెప్పినప్పట్నుంచీ, సన్నాయి వాద్యగాళ్ళు బుద్ధిమంతులై వుంటారనీ, నీచమైన పన్లు చెయ్యరనీ అనుకున్నాను.! ఈ రోజుల్లో అందరూ పైకి ఏదో కళాసేవ చేస్తూన్న వారిలా వుంటారు. ఎవర్ని నమ్మాలో, ఎవ్వర్ని నమ్మకూడదో తెలియని రోజులు వచ్చాయి! సన్నాయి బాధపడితే పడతాను గాని, ఈ సారి ఎవరినైనా సన్నాయి వాయిస్తూంటే, చెవులలో దూది పెట్టుకుని వాళ్ళు వెళ్ళే దాకా వాళ్ళతోనే వుంటాను, సరేనా!"

'అసలు ఆ సన్నాయి వాళ్ళే సామాను పట్టుకుపోయారని ఎందుకు అనుకోవాలి మీరు ఒక్క విషయం నేర్చుకోండి ఎవరు ఏ పని చెసినా పొట్టకూటి కోసమే కదా!"

"అవును కోటి విద్యలూ కూటి కొరకే" అన్నాడు చిన్మయుడు.

"ఎవరైనా మాట్లాడేటప్పుడు మధ్యలో కల్పించుకుని మాట్లాడడం మర్యాద కాదు! ఈ విషయం కూడా తెలుసుకోండి!"

మా తాతగారి హయంలో సన్నాయి వాళ్ళని నూతన వస్త్రాలతో సత్కరించే వారు. గుమ్మంలోకి వచ్చిన వాళ్ళకి ఏదయినా దానం చెయ్యడం నేర్చుకోండి! అసలు ఎవ్వరూ దానం చెయ్యకపోతే బీదవాళ్ళు ఎలా బ్రతుకుతారండీ! దానం చెయ్యకపోతే వాళ్ళని మనమే దొంగల్ని చేసినట్లవుతుంది.

అర్థమయిందా! పైగా సన్నాయి వాళ్ళని అవమానిస్తే స్వర్గంలో వున్న మా తాతా ఆత్మ ఘోషిస్తుంది.

"అయిందేదో అయిపోయింది! ఈ పైన్న తిన్నగా 'వుంటాను' అన్నాడు చిన్మయుడు.